సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం ǀ 18 ǀ ఆగస్టు ǀ 2023



మహిమాన్వితం.. తిక్క శంకరయ్య ఆలయం

ప్యాంటు, చొక్కా దేవుడిగా ప్రసిద్ధి పొందిన శంకరయ్య ఆరాధనోత్సవాలు ఈనెల 21 నుంచి జరగనున్నాయి. -8లో



పోలీసు నిబంధనలకు లోబడే రాజారెడ్డి పోస్టుమార్టం

పోలీసు నిబంధనలకు లోబడి డాడీ హోం రాజారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని పోలీసులు తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.320	రూ.400
రెండోరకం	రూ.220	రూ.310



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 242 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	275	562
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 296.300 కిలోలు

న్యూస్‌రీల్

నేటి నుంచి పీఈటీలకు శిక్షణ

రాయచోటి టౌన్‌: ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నిర్వహించే క్రీడలపై పీఈటీలకు 18, 19 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు అన్నమయ్య జిల్లా డీఈఓ శ్రీరాం శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలోని అన్ని ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలలో పని చేస్తున్న పీఈటీలకు మైదుకూరులోని మేధా డిఫెన్స్ అకాడమీలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో 2022–2023 సంవత్సరానికి సంబంధించి ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా, ఆడుదాం ఆంధ్ర, పాఠశాల సమాఖ్య క్రీడల తదితర అంశాలపై శిక్షణ నిర్వహిస్తారని చెప్పారు.

ఉద్యాన పంటల పరిశీలన



చీని చెట్లకు నీరుపోస్తున్న డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి

సిద్దవటం: మండలంలోని పెద్దపల్లె, బొగ్గిడివారిపల్లె, గ్రామాల లోని ఉద్యాన పంటలను గురువారం డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి పరిశీలించారు. మహాత్మా జాతీయ ఉపాధిహామీ పథకం కింద పెద్దపల్లె, బొగ్గిడివారిపల్లె గ్రామాల్లో దాదాపు 10 ఎకరాల్లో రైతులు చీని చెట్లను సాగుచేశారు. వీటిని పరిశీలించారు. చెట్లకు నీరు పోశారు.కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్ రెడ్డి, ఏపీఓ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా నడిచిన ప్యాసింజర్ రైలు



ములకలచెరువు రైల్వేస్టేషన్‌లో నరసాపురం - మచిలీపట్నం రైలు

ములకలచెరువు: గుంతకల్లు నుంచి తిరుపతికి నడిచే ప్యాసింజర్ రైలు గురువారం నాలుగు గంటలపాటు ఆలస్యంగా నడిచింది. ములకలచెరువు రైల్వేస్టేషన్‌కు ఉదయం 10.50 గంటలకు రావాల్సి ఉండగా 02.50 గంటలకు వచ్చింది. దీనితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

యధావిధిగా రైళ్ల రాకపోకలు

మునుబోలు–గూడూరు రైల్వే మార్గంలో ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా సత్యసాయి జిల్లా ధర్మవరం జంక్షన్ నుంచి ఐదు రోజులుగా ములకలచెరువు మీదుగా వెళ్లే నరసాపురం రైలు, నరసాపురం నుంచి ధర్మవరం, ధర్మవరం - మచిలీపట్నం, మచిలీపట్నం - ధర్మవరంల మధ్య నడిచే నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 11న రద్దు చేశారు. ఈ రైళ్లు గురువారం నుంచి యధావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయని రైల్వే ఆధికారులు తెలిపారు.

సమాజ హితమే పరిశోధన లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న వైవీయూ వీసీ

వైవీయూ: సమాజ హితమే పరిశోధనల లక్ష్యం కావాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. గురువారం వైవీయూలోని హ్యూమానిటీస్ భవనంలో పరిశోధక విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువ పరిశోధకులు ఉత్తమ ఆవిష్కరణలపై దృష్టిసారించాలన్నారు. అకుంఠిత లక్ష్యంతో పరిశోధన చేసేవారికి విశ్వవిద్యాలయం అండగా నిలుస్తుందన్నారు. భారతదేశంలో ఊహించని అభివృద్ధి జరుగుతోందని, పరిశోధకులుగా మనం దేశానికి ఒక బలం కావాలన్నారు. మనంరాసే పరిశోధక పత్రాలు స్కోపస్, నాస్ తదితర ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితం కావాలని, అప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు గైడ్‌ను అనుసరించి పరిశోధనలు కొనసాగించాలని సూచించారు. పరిశోధనలు చేసేవారికి ప్రభుత్వ, అనుబంధ పరిశోధక సంస్థలు ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహకాల పట్ల అవగాహన కల్పించారు.

పైడిపాలెంలో ఏపీ లోకాయుక్త

సింహాద్రిపురం: ఏపీ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి గురువారం ఆయన స్వగ్రామమైన పైడిపాలెం గ్రామానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల తహసీల్దార్ మహబూబ్ బాష, ఆర్ఐ షేక్షా, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం గ్రామంలో నూతన నాగులకట్ట ఆలయంలో విగ్రహాల ఆవి ష్కరణ కార్యక్రమం సందర్భంగా స్వగ్రామానికి వచ్చారు. కార్యక్రమం ముగించుకుని వెళ్లనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

కష్టపడ్డారు.. కల నెరవేర్చారు..!

గ్రూప్‌-1 ఫలితాల్లో సత్తా చాటిన యువత

వారందరూ సామాన్య, రైతు కుటుంబాలకు చెందిన వారు.. అందరిదీ ఒకటే లక్ష్యం.. అమ్మనాన్నల కల నెరవేర్చడం.. చిన్నతనం నుంచి కష్టపడ్డారు.. క్రమశిక్షణతో చదువుకున్నారు.. ఒక్కో మెట్టు ప్రణాళికతో ఎక్కారు. గురువారం విడుదలైన గ్రూప్‌–1 ఫలితాల్లో విజయం సాధించారు.. అత్యుత్తమ ఫలితాలతో ఉన్నత కొలువులు సాధించారు.. తమ, తల్లిదండ్రుల కల నెరవేర్చారు.. వారి విజయ గాథపై స్ఫూర్తిదాయక కథనాలు.



డీఎస్పీగా ఎంపికైన శివప్రియారెడ్డికి స్వీట్ తినిపిస్తున్న భర్త, అత్తమామలు

మెకానిక్ ఇంట సరస్వతీ పుత్రుడు

అట్లూరు: మోటారు మెకానిక్ పని చేసుకుని జీవనం సాగించే వ్యక్తి కుమారుడు గ్రూప్‌–1కు ఎంపికై శభాష్ అనిపించుకున్నాడు. మండల పరిధిలోని గోపినాధపురం గ్రామానికి చెందిన మెంటా నాగమల్లయ్య, సరస్వతి కుమారుడు మెంటా మల్లికార్జున జార్ఖండ్‌లో ఐఐటీ పూర్తి చేసి మొదట సారిగా గ్రూప్‌–1 రాశాడు. మొదటి ప్రయత్నంలోనే గ్రూ–1లో సెక్రటరీ అండ్ ట్రెజరీ గ్రేడ్‌–2 ఇన్ మెడికల్ అండ్ హెల్త్ అడ్మిస్ట్రేషన్ సర్వీసులో అడ్మిస్ట్రేషన్ ఆఫీసర్‌గా ఎంపిక అయ్యాడు. మల్లికార్జున తండ్రి వ్యవసాయ మోటార్ల వైరింగ్, మెకానిక్ పనులు చేసుకుని జీవనం సాగిస్తూ కుమారుడిని చదివించాడు. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్‌–1లో ఉద్యోగం సాధించడంతో ఆయన ఆనందానికి అవధులు లేవు. అలాగే మండల వ్యాప్తంగా మల్లికార్జునను ప్రశంసిస్తున్నారు.



మెంటా మల్లికార్జున

భర్త, అత్తమామల సహకారంతో..

బద్వేలు అర్బన్ : కృషితో నాస్తి దుర్భిక్షం అన్న పదానికి సిసలైన నిదర్శంగా నిలిచింది ఆ యువతి. మొదటి ప్రయత్నంలో విజయం అంచుల దాకా వెళ్లి వెనుదిరిగినప్పటికీ ఏమాత్రం అధైర్యపడకుండా రేయింబవళ్లు యజ్ఞంలా శ్రమించింది. మరోవైపు భర్త, తల్లిదండ్రులు, అత్తామామల సహకారం ఆమెను విజయతీరాలకు చేర్చింది. బద్వేలుకు చెందిన అంకిరెడ్డిపల్లె శివప్రియారెడ్డి డీఎస్పీగా ఎంపికైంది. జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన అంకిరెడ్డిపల్లె రామశేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె శివప్రియారెడ్డి పదో తరగతి వరకు ప్రొద్దుటూరులోని గోపికృష్ణ స్కూల్‌లో చదివింది. ప్రొద్దుటూరులోని షిరిడిసాయి కళాశాలలో ఇంటర్మీడియెట్, రాజంపేట సమీపంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసింది. ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ 2018లో గ్రూప్‌–1 పరీక్షకు హాజరైంది. తొలి ప్రయత్నంలో విజయం దక్కలేదు. 2021లో బద్వేలుకు చెందిన పెసల మణికాంత్‌రెడ్డితో వివాహం జరిగింది. భర్త, అత్తమామలు మల్లేశ్వర్‌రెడ్డి, సరస్వతిల ప్రోత్సాహంతో తిరిగి 2022లో గ్రూప్‌–1 పరీక్షకు హాజరై ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత సాధించి సివిల్ డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యారు.

స్వతహాగా సన్నద్ధమై..

కలసపాడు : మండలంలోని దూలంవారిపల్లె దళితవాడకు చెందిన ఒడ్డెపోగు శామ్యూల్‌డెన్ని అసిస్టెంట్ ఆడిట్ అధికారిగా ఎంపికయ్యారు. పేద కుటుంబానికి చెందిన పీటర్ రాయప్ప, మరియమ్మ కుమారుడైన శామ్యూల్‌డెన్ని ప్రస్తుతం పోరుమామిళ్ల మండలంలోని దమనపల్లె పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. స్వతహాగా సన్నద్ధమై గ్రూప్‌–1 పరీక్షల్లో అసిస్టెంట్ ఆడిట్ అధికారిగా ఎంపికయ్యారు. ఆయన భార్య సౌమ్యలీనారాణి వ్యవసాయ విస్తరణాధికారిగా పని చేస్తున్నారు.



శామ్యూల్‌డెన్ని

ఐఏఎస్ కావడమే లక్ష్యం

రాజంపేట : నందలూరు మండలం గొల్లపల్లెకు చెందిన గొబ్బిళ్ల శ్రీకృష్ణ శ్రీవాత్సవను జిల్లా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారిగా నియమించారు. ఈయన సోదరి విద్యాధరి నెల్లూరులో ట్రైనీ కలెక్టరుగా పని చేస్తున్నారు. తండ్రి గొబ్బిళ్ల సుబ్బరామయ్య, గొబ్బిళ్ల సుజాత ఏకైక కుమారుడు కృష్ణశ్రీ. ఈయన తల్లితో కలిసి ప్రస్తుతం చెన్నైలో ఉంటున్నారు. అనంతపురం జేఎన్‌టీయులో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసించారు. గొబ్బిళ్ల కృష్ణశ్రీ వాత్సవ మాట్లాడుతూ ఐఏఎస్ కావడం తన లక్ష్యమన్నారు.



కృష్ణశ్రీ వాత్సవ

ఇకపై డీఎస్పీ భవాని

కదిరి: అనంతపురం జిల్లా తలుపుల మండలం గంజివారిపల్లికి చెందిన టి.భవాని డీఎస్పీగా ఎంపికయ్యారు. ఆమె ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలో డిప్యూటి తహసిల్దార్‌గా పని చేస్తున్నారు. అంతకు మునుపు గ్రూప్‌–2లో ఎంపికై వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో కూడా పని చేశారు. తండ్రి చెన్నక్రిష్ణ కదిరిలో ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. భవాని డీఎస్పీగా ఎంపిక కావడం పట్ల ఆమె తల్లిదండ్రులు సంతోషం వెలిబుచ్చారు.



భవాని

తొలి ప్రయత్నంలోనే..

కొండాపురం: కొండాపురానికి చెందిన బొడెల ఈశ్వర్‌రెడ్డి, సువర్ణ దంపతుల కుమార్తె సుజిత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఎంపిక అయ్యారు. ఆమె ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ముద్దనూరు మండలం మంగపట్నం సమీపంలోని థెరిస్సా డిలీమా పాఠశాలలో చదివింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ చేసింది. 2021 నుంచి సివిల్స్‌కు ప్రిపేర్ అయింది. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్ వన్ అధికారిగా ఉత్తీర్ణత సాధించింది.



బోడెల సుజిత

తండ్రి ప్రోత్సాహంతో..

మదనపల్లె సిటీ: 'నేను అనుకున్నది సాధించడం సంతోషంగా ఉంది' అని గ్రూప్‌–1లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన షేక్ అయేషా అన్నారు. మొదటి ప్రయత్నంలో త్రుటిలో తప్పినా రెండో సారి విజయం సాధించినట్లు ఆమె తెలిపారు. మదనపల్లె మండలం ఈశ్వరమ్మకాలనీకి చెందిన షేక్ అహ్మద్‌బాషా, షేక్ గౌసియా దంపతుల ఏకై క కుమార్తె షేక్ అయేషా. ప్రాథమిక విద్య మదనపల్లెని ఆరోగ్యమాత స్కూలు, తిరుపతిలో ఎస్ఆర్ఐ కాలేజీ, తమిళనాడు తంజావూరు శస్త్ర యూనివర్సిటీలో బీటెక్ చేసింది. టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం వచ్చినా 2018 నుంచి సివిల్స్ కోచింగ్ తీసుకుంది. తండ్రి సీజనల్ వ్యాపారం చేస్తూ కుమార్తెను సివిల్ రాసేందుకు ప్రోత్సాహించాడు. తనకు అమ్మ, నాన్నతోపాటు గురువు ఫినాక్స్ ఇన్‌స్టిట్యూట్ అధినేత యాదగిరి, మిత్రుడు మిథున్ సహకారంతో సివిల్స్‌లో రాణించానని సంతోషం వ్యక్తం చేసింది.



షేక్ అయేషా

గ్రామీణ అభ్యర్థినికి 3వ ర్యాంకు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఏపీపీఎస్సీ ఫలితాల్లో విజయవాడలోని శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీలో శిక్షణ పొందిన అన్నమయ్య జిల్లాకు చెందిన లక్ష్మీప్రసన్న 3వ ర్యాంకు సాధించినట్లు అకాడమీ ఎండీ తోట శరత్‌చంద్ర తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన లక్ష్మీప్రసన్న, మరికొందరు అత్యుత్తమ ర్యాంకులు సాధించారన్నారు. లక్ష్మీప్రసన్న తపంచాయితీ సెక్రటరీగా పనిచేస్తూనే కష్టపడి చదివిందన్నారు. పరీక్షల్లో ఇన్ఫర్మేషన్ కంటే, ప్రజెంటేషన్ నైపుణ్యం ముఖ్యమని, కరెంట్ అఫైర్స్, విషయాలను సమగ్రంగా అర్థం చేసుకుని పొందుపరచడం వంటివి ర్యాంకులు సాధించడానికి కారణమయ్యాయని చెప్పారు.



లక్ష్మీప్రసన్నతో శరత్‌చంద్ర

భవన నిర్మాణాలను గడువులోపు పూర్తి కావాలి

రాయచోటి: జిల్లాలో జరుగుతున్న రీసర్వే, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి ఏపీ సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో రెవెన్యూ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రీసర్వే రెండో విడతలో భూముల రీసర్వే పూర్తయిన వాటిలో రాళ్లు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన అర్జీకేతర వినతులను వెంటనే పరిష్కారం చూపాలని అన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- జిల్లా ఆస్పత్రిలో డిప్యుటేషన్‌పై ఖాళీల భర్తీ
- కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే

మదనపల్లె: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కీలకపోస్టుల్లోని ఖాళీలను తక్షణమే డిప్యుటేషన్‌పై భర్తీ చేయాలని, రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలని, పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా కలెక్టర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గిరీషా.పీఎస్. పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల డీసీహెచ్ఎస్‌లు డాక్టర్.బీసీకే.నాయక్, డాక్టర్.డేవిడ్ సుకుమార్, డీఎంహెచ్ఓ కొండయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది వివరాలు, రోజువారి ఓపీ సంఖ్య, అందిస్తున్న జనరల్, ఆరోగ్యశ్రీ సేవలు, తదితర అంశాలపై ఆస్పత్రి సూపరిండెంట్, ఆయా విభాగాల వైద్యులు, సిబ్బందితో సుదీర్ఘంగా చర్చించారు. గతంలో జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చించిన అంశాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీషా మాట్లాడుతూ.. సాధారణ బదిలీల్లో భాగంగా నెలరోజుల కిందట జిల్లా ఆస్పత్రిలోని డాక్టర్లు బదిలీపై వెళ్లారన్నారు. జిల్లాలో పనిచేస్తున్న గైనకాలజీ, అనస్తీషియా వైద్యులను డిప్యుటేషన్‌పై జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహించేలా రెండురోజుల్లో ఆదేశాలు జారీచేస్తామన్నారు. ఆస్పత్రిలో ఖాళీలను, ఇతర వైద్యపోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వైద్యులు సేవలందించాలన్నారు.గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా వైద్యులు, తగినన్ని వసతులు, వైద్యపరికరాలు లేక ప్రజలకు సేవలందించలేక, వారి నమ్మకాన్ని కోల్పోయారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వాసుపత్రుల రూపురేఖలు మారడమే కాకుండా మల్టీస్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తుండటం, పూర్తిస్థాయిలో వైద్యుల నియామకంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందేందుకు ప్రజలు వస్తున్నారన్నారు. ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రాయల్ మురళీ, వినుతాభాయి, కృష్ణగోపాల్‌నాయక్, డీఎల్డీఓ లక్ష్మీపతి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే నవాజ్‌బాషా తదితరులు

వార్డు ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం పరిధిలోని వార్డు మెంబర్ ఖాళీలకు నిర్వహించనున్న ఎన్నికల ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. ఖాళీ అయిన మూడు వార్డులకు ఈ నెల 19వ తేదీన ఎన్నికల నిర్వహించేలా అధికారులను సమాయాత్తం చేసినట్లు గురువారం కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రెండు సర్పంచ్ స్థానాలకు, 48 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. వీటిలో రెండు సర్పంచ్ స్థానాలకు 44 వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో వాటిని ఏకగ్రీవం అయినట్లు ప్రకటించారు. నందలూరు మండలం పాటూరు గ్రామ పంచాయతీ పదవ వార్డుకు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. రాయచోటి నియోజకవర్గ పరిధిలోని శిబ్యాల పంచాయతీలో 12వ వార్డు, గొర్లముదివీడు పంచాయతీలో 3వ వార్డు, లక్కిరెడ్డిపల్లె పంచాయతీలో 2వ వార్డులకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. 3 వార్డులలో 853 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికలు జరిగే ప్రభుత్వ భవనాల కార్యాలయాలకు 18, 19వ తేదీలలో సెలవు దినాలుగా ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని అధికారుల కేటాయింపును పూర్తి చేసినట్లు పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ తెలియపరిచారు.

ఉన్నత చదువుకు ఉపకారం

- ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు ఏటా రూ. 12వేలు సాయం
- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



స్పెషల్ క్లాసులో చదువుతున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: ఉన్నత చదువులు చదవాలనుకునే పేద విద్యార్థులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిభా ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ప్రతిభ ఉండి, ఆర్థిక సమస్యలు ఎదుర్కొనే వారి కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్(ఎన్ఎంఎంఎస్) కింద ఆర్థిక చేయూతనిస్తోంది. ఈ పరీక్షల్లో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని ఇస్తుంది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ చదివే పేద విద్యార్థులకు ప్రతి ఏడాది ఆర్థికసాయం అందనుంది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి (2023–24) ఎన్ఎంఎంఎస్ నోటిఫికేషన్ ఏపీ డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ విభాగం ఇటీవల విడుదల చేసింది.

- ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12 వేలను స్కాలర్‌షిప్ రూపంలో అందిస్తుంది. ఈ మొత్తం నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాల్లోకి వస్తుంది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తి చేసే వరకు ఉపకార వేతనం లభిస్తుంది. జిల్లాలో 16,696 మంది ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ప్రతిభ చూపే వారికి సాయం అందుతుంది. వీరందరికి నాలుగేళ్ల పాటు ఈ ఉపకార వేతనాలు అందుతున్నారు.

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాల పరీక్షకు దరఖాస్తుల ప్రక్రియ ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 10 నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా అన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలి. అనంతరం సంబంధిత ప్రింటవుట్లను, ధృవీకరణ పత్రాలను డీఈఓలకు పంపించాలి.ఇందుకోసం సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉంది. 19న డీఈఓ కార్యాలయంలో సమర్పించాలి. డిసెంబర్ 3న పరీక్ష ఉంటుంది. ప్రతి విద్యార్థి పరీక్ష ఫీజు కింద రూ.100 ఎస్‌బీఐ చలానా రూపంలో సంబంధిత ధృవపత్రాలతో పాటు జతచేయాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు మాత్రం రూ.50 ఫీజు చెల్లించాలి.

అర్హతలు ఇవీ..

ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో చదివే విద్యార్థులు ఈ ప్రోత్సాహకాలకు అర్హులు. ఏడో తరగతితలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. తుది ఎంపిక సమయం నాటికి 8వ తరగతిలో 55 శాతం మార్కులు పొందాలి. కుటుంబ వార్షికాదాయం ఏడాది రూ.3,50,000 మించకూడదు. ఎన్ఎంఎంఎస్ రాత పరీక్ష ద్వారా స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేస్తారు.

పరీక్ష విధానం..

అర్హులైన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్ష అబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లుగా ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (మ్యాట్) స్కాలస్టిక్ అప్టిట్యూడ్ టెస్టు (సాట్) ఇలా రెండు పేపర్లు కలిపి 180 ప్రశ్నలకు 180 మార్కులుంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు ఉంటుంది. మ్యాట్ పేపర్‌లో మూడు విభాగాల నుంచి 90 ప్రశ్నలను అడుగుతారు. మెంటల్ ఎబిలిటీ–45, ఇంగ్లీషు ప్రొఫిషియన్సీ –20, హిందీ ప్రొఫిసియన్సీ నుంచి 25 చొప్పున ప్రశ్నలను ఇస్తారు. సాట్ పేపర్‌లో కూడా మూడు విభాగాలు నుంచి ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 90 ప్రశ్నలుంటాయి. ఇందులో సైన్సు 35 ప్రశ్నలు, సోషల్ స్టడీస్ –35, మ్యాథమెటిక్స్ విభాగం నుంచి 20 చొప్పున ప్రశ్నలను అడుగుతారు.

ఎన్ఎంఎంఎస్ సమాచారం..

- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తు చేయడానికి చివరి తేది: 15.9.2023
- దరఖాస్తు ఫారాలు, ధృవపత్రాలను డీఈఓ కార్యాలయంలో అందజేసేందుకు చివరి తేదీ: 19.10.2023
- డీఈఓ లాగిన్లో ఆమోదం పొందేందుకు చివరి తేదీ: 22.09.2023
- వెబ్‌సైట్: హెచ్‌టీటీపీ:// బీస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎక్కువ మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎంపికై న వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక భరోసా లభిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.



–శ్రీరాం పురుషోత్తం, డిఈఓ, అన్నమయ్య జిల్లా

ఎక్కువ మంది ఎంపికయ్యేందుకు కృషి

మా పాఠశాలలో ప్రతి ఏడాది 15 నుంచి 20 మంది ఈ పరీక్షలో సత్తాచాటుతున్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా కోచింగ్ ఇస్తాం. ఈ పరీక్ష గురించి విద్యార్థులకు తెలియజేశాం. వారితో దరఖాస్తు చేయించి, ప్రణాళికాబద్ధంగా బోధన సాగిస్తాం. ఎక్కువ మంది ఎంపికయ్యేందుకు కృషి చేస్తాం. –పురం వెంకటరమణ, ఉపాధ్యాయుడు, వివేకానంద మున్సిపల్ పాఠశాల, మదనపల్లె



'మార్గదర్శి' కార్యాలయాల్లో సీఐడీ తనిఖీలు



కడపలో తనిఖీలు చేస్తున్న సీఐడీ అధికారులు

కడప అర్బన్/ప్రొద్దుటూరు క్రైం: రాష్ట్ర వ్యాప్తంగా 'మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయాల్లో సీఐడీ అధికారుల బృందం గురువారం ఏకకాలంలో ఉదయం 11 గంటలకు తనిఖీలు ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లాలో కడప, ప్రొద్దుటూరులోని కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టింది. కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా వున్న మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయంలో జరిగిన సోదాల్లో తిరుపతి నుంచి వచ్చిన సీఐడీ అధికారులు డీఎస్పీ రాఘవన్, సీఐ ఆంజనేయ ప్రసాద్, ఐదుగురు సిబ్బంది పాల్గొన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని టీబీ రోడ్డులో ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయంలో ఏడుగురు అధికారుల బృందం తనిఖీలు చేశారు. రాత్రి వరకు ఈ తనిఖీలు కొనసాగాయి. పలు కీలకమైన రికార్డులను పరిశీలించారు. ప్రధానంగా పన్ను చెల్లింపులు, ఇతర కీలక రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అవసరమైన రికార్డుల ప్రతుల జిరాక్స్ తీసుకున్నారు. మరో మూడు లేక నాలుగు రోజుల పాటు కొనసాగించనున్నారు. ఈ తనిఖీలను పూర్తి చేసిన తరువాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివరాలను తెలియజేస్తామని సీఐడీ అధికారుల్లో ఒకరు వెల్లడించారు.

అరటి కాయల లోడు వాహనం బోల్తా


బోల్తా పడిన అరటికాయల వాహనం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని నడింపల్లి గ్రామ సమీపంలో అరటికాయల లోడు తీసుకెళుతున్న వాహనం గురువారం అదుపు తప్పి బోల్తా పడింది. పోలీసు వివరాల మేరకు... అరటికాయల లోడుతో వెళుతున్న బొలేరో పికప్ వాహనం మండల పరిధిలోని నడింపల్లి గ్రామ సమీపంలోని కడప–చెన్నై జాతీయ రహదారిపైకి రాగానే అతి వేగంతో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో వాహనంలోని రాజంపేటకు చెందిన డ్రైవర్ రాంబాబు వాహనంలో నుంచి సురక్షితంగా బయటపడి, వేరొక వాహనంలో వెళ్లి పోయాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బోల్తా పడిన వాహనాన్ని పక్కకు జరిపి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

గాయపడిన నెమలిని కాపాడిన పోలీసు


గాయపడిన నెమలి ఇదే

రాజంపేట : రాజంపేట–రాయచోటి మార్గంలోని ఎస్ఆర్ పాళెం(రాజంపేట రేంజ్) సమీపంలో గాయాలతో రోడ్డుపై పడి విలవిల్లాడుతున్న నెమలి నందలూరు పోలీసు స్టేషన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రరావుకు బుధవారం తారసపడింది. సానిపాయి నుంచి రాజంపేటకు వస్తుండగా సొమ్మసిల్లిపడి ఉన్న నెమలిని తీసుకుని వెళ్లి రాజంపేట రేంజర్ నారాయణకు అప్పగించారు. నెమలికి చికిత్స తర్వాత బాగానే ఉందని, అడవిలో వదిలిపెట్టినట్లు రేంజర్ తెలిపారు.

ఇద్దరు మహిళల ఆత్మహత్యాయత్నం

మదనపల్లె సిటీ : మదనపల్లె, కురబలకోట మండలాల్లో వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడిన సంఘటన గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం తట్టివారిపల్లెకు చెందిన మురుగన్ భార్య ధనలక్ష్మి(28) గన్నేరు పప్పుతిని ఆత్మహత్యకు యత్నించింది. భార్య,భర్తల గొడవల కారణంగా ఆమె ఈ చర్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ కొత్తవడ్డిపల్లెకు చెందిన చలపతి భార్య మంజుల(40) కడుపునొప్పి తాళలేక ఇంటిలోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు.

మహిమాన్వితం.. తిక్క శంకరయ్య ఆలయం

- ప్యాంటు, చొక్కా దేవుడిగా ప్రసిద్ధి
- 21 నుంచి శంకరాపురంలో ఆరాధనోత్సవాలు



శంకరాపురంలోని శంకరయ్య ఆలయం (పైన ప్యాంటు, చొక్కాలో శంకరయ్య విగ్రహం)


చిరిగిన ప్యాంటు, చొక్కాతో తిక్క శంకరయ్య

బి.కొత్తకోట : దేవుళ్లు ప్యాంటు, చొక్కా వేసుకొంటారా! ఇది ఎక్కడైనా ఉందా? ఇదేమి విచిత్రం అని అనుకొంటున్నారా. ఇది అక్షరాలా నిజం..నమ్మకం కుదరలేదా అయితే బి.కొత్తకోటకు నాలుగు కిలోమీటర్ల దూరంలోని శంకరాపురం వస్తే కళ్లారా చూడవచ్చు. ప్యాంటు చొక్కా వేసుకొన్న ఈ తిక్క శంకరయ్య సాధారణ వ్యక్తిగా ఉంటూ చనిపోయాక ఈ ప్రాంత ప్రజలకు దేవుడై తిక్క శంకరయ్యగా పేరుగాంచారు. 1970 దశాబ్దంలో దయ్యాలు వదిలించుకునేందుకు కర్ణాటక రాష్ట్రం, కడప, ఉమ్మడి అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన వారు తండోపతండాలుగా శంకరయ్య ఆలయానికి క్యూ కట్టేవారు. అప్పట్లో మహిమాన్విత ఆలయంగా, పుణ్యక్షేత్రంగా వెలుగొందింది. అయితే కాలక్రమేణ తిక్కశంకరయ్య ప్రాశస్త్యం మసకబారింది. ఇప్పుడు సాధారణ ఆలయాల్లో ఒక ఆలయంగా భక్తుల పూజలందుకొంటోంది. ఈనెల 21 నుంచి ఈ దేవుడి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్యాంటు చొక్కా దేవుడి గురించిన వివరాల్లోకి వెళ్తే..

తూర్పుగోదావరిజిల్లా ముమ్మిడివరానికి చెందిన శంకరయ్య కొంతకాలం హిమాలయాల్లో గడిపారు. తర్వాత దేశాటన చేస్తూ కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లోనూ, చివరి రోజుల్లో బి.కొత్తకోటకు చేరుకున్నారు. ఇక్కడి పరిసర ప్రాంతాల్లో గడిపారు. మతిస్థిమితం తప్పిన వాడిలా సంచరిస్తూ బి.కొత్తకోట దిగువబస్టాండ్ (అప్పట్లో ఇదే నివాస గ్రామం) ప్రాంతంలోని కుటుంబాల వారు పెట్టే భోజనం తింటూ ఇక్కడి పెద్దచెరువులో స్నానం చేస్తూ ఎక్కడపడితే అక్కడ నిద్రిస్తూ గడిపేవారు. స్థానికులతో ముచ్చటించే సమయంలో భవిష్యత్తులో జరిగే కొన్ని సంఘటనలు, సమాజంలో చోటుచేసుకునే మార్పుల గురించి చెప్పేవారు. వీటిని విన్న స్థానికులు నమ్మేవాళ్లు కాదు. 1977 ఆగస్టు 24న శంకరయ్య మృతి చెందగా బి.కొత్తకోటకు నాలుగు కిలోమీటర్ల దూరంలోని శంకరాపురంలో సమాధి చేశారు. ఆ సమాధిపైనే ఆలయాన్ని నిర్మించగా తిక్కశంకరయ్య ఆలయంగా విశేష ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ రోజుల్లో ఆలయానికి భక్తులు పోటెత్తేవారు. ప్రతిరోజూ వేలసంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించేవారు. దయ్యాలు పట్టి నవారు ఇక్కడివస్తే దయ్యాలు వదిలిపోతాయని ప్రజల్లో బలంగా విశ్వాసం ఏర్పడింది. నిత్యం పూజలు, అన్నదానాలతో కిటికిటలాడేది. స్థానికులు, బి.కొత్తకోటకు చెందిన ప్రముఖులు ఆలయానికి భూములు విరాళంగా ఇచ్చారు. శంకరయ్య పేరుతో ట్రస్టును స్థాపించి కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలు, ఆలయ నిర్వహణ బాధ్యతలను కమిటీ ఇప్పటికి చూస్తోంది. 1980లలో బి.కొత్తకోటలో జూనియర్ కళాశాల స్థాపించాలనుకొన్నప్పుడు శంకరయ్య ట్రస్టుకు చెందిన గదులు, వసతులు కల్పించడంతో ఇక్కడే ప్రారంభించగా తర్వాత బి.కొత్తకోటకు తరలించారు. ట్రస్టు ద్వారా ప్రజలకు ఎన్నో సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్యాంటు చొక్కాతోనే..

దేవుడిగా మారిన శంకరయ్య కోసం నిర్మించిన ఆలయంలో ఆయన ప్రతిమను ప్యాంటు, చొక్కాతోనే ఏర్పాటు చేశారు. ఆలయంపై మధ్య భాగంలో విగ్రహం ఇలాగే ఉంటుంది. పైన ఇతర దేవుళ్ల విగ్రహాలు కనిపిస్తాయి. ఆలయంలో వివాహల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు ఉన్నాయి. ఇక్కడ వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరిగాయి. పెళ్లిమంటపం వెనుక చిరిగిన ప్యాంటు, చొక్కా ధరించిన తిక్కశంకరయ్య చిత్రపటం ఉంటుంది. 1977 నుంచి 1980 వరకు ఆలయం వెలుగొందిన తీరును చూస్తే జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని స్థానికులు భావించారు. అయితే కొన్నేళ్లకే ఆలయ ప్రాముఖ్యం కోల్పోగా, ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడా బి.కొత్తకోటకు తరలిపోయింది. అయితే కళాశాల పేరు మాత్రం ఇంకా శంకరాపురం కళాశాల పేరుతోనే కొనసాగుతుండటం విశేషం.

21 నుంచి ఉత్సవాలు

శంకరయ్య స్వామి ఆరాధనోత్సవాలు ఈనెల 21న ప్రారంభమై 24 వరకు ఘనంగా జరగనున్నాయి. భక్తుల భజనలు, అఖండ రామకోటి, నిత్య పూజలు, అభిషేకాలు, హోమాలు, భక్తుల ఆరాధన తదితర కార్యక్రమాలు జరుగుతాయి. దీనికోసం కమిటీ ఇప్పటికే ఏర్పాట్లను ప్రారంభించగా చిత్తూరు, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం జిల్లాలు, సరిహద్దులోని కర్ణాటకకు చెందిన భక్తులు తరలిరానున్నారు.

కారు, లగేజ్ ఆటో ఢీ

– ఒకరికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన ఖాదర్‌వలీ


కాళ్లు విరిగిన నాగభూషణంరెడ్డి

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని రామతీర్థం వద్ద ఉన్న కడప–చెన్నై జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు, లగేజ్ ఆటో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసు వివరాల మేరకు...కడప నుంచి అరవపల్లికి వెళుతున్న ఏపీ 04 ఏజీ 5778 నంబర్ గల కారు, కోడూరు నుంచి కడపకు వెళుతున్న ఏపీ 02 టీడీ 3251 నంబర్ గల లగేజ్ ఆటో స్థానిక రామతీర్థం వద్ద ఉన్న జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో కారులో ఉన్న అరవపల్లికి చెందిన ఖాదర్ వలీకి(60) తీవ్ర గాయాలయ్యాయి. కారులో డ్రైవింగ్ చేస్తున్న సమీప బంధువుకు స్వల్ప గాయాలు అయ్యాయి. అలాగే లగేజ్ ఆటో డ్రైవింగ్ చేస్తున్న నాగభూషణంరెడ్డికి(51) కాళ్లు విరిగాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాన్యం భూములు ప్రాపర్టీ రిజిస్టర్‌లో పక్కాగా నమోదు

- 1,381 ఆలయాలకు 9,978.38 ఎకరాలు
- ఆక్రమణలో 2,112.35 ఎకరాలు
- దేవుని మాన్యాన్ని ఆక్రమిస్తే ఐదేళ్ల జైలుశిక్ష
- దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్


బి.కొత్తకోటలో అర్చకుల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ్

బి.కొత్తకోట : జిల్లాలోని ఆలయాల మాన్యం భూములను ప్రాపర్టీ రిజిస్టర్‌లో పక్కాగా నమోదు చేస్తున్నామని దేవదాయ, ధర్మాదాయశాఖ జిల్లా అధికారి సి.విశ్వనాథ్ తెలిపారు. గురువారం ఆయన బి.కొత్తకోట చెన్నకేశవాలయంలో బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, రామసముద్రం, ములకలచెరువు మండలాలకు చెందిన అర్చకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల భూములు ఆస్తుల జాబితాలో ఇప్పటి వరకు నమోదు కాలేదన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఒక్క సెంటు స్థలం కూడా వదలకుండా వివరాలను నమోదుచేసే ప్రక్రియ ప్రారంభించినట్లు చెప్పారు. 1,381 ఆలయాలకు చెందిన 9,978.38 ఎకరాలు ఉండగా అందులో 3,669.44 ఎకరాలు మాత్రమే ప్రాపర్టీ రిజిస్టర్‌లో నమోదైందని చెప్పారు. మిగిలిన భూములను నమోదు చేసేందుకు ఆలయ స్థాయిలో భూములను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 2,112.35 ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నాయన్నారు. ఆలయాల ప్రాంగణాల్లో 6,54,154 చదరపు గజాల ఖాళీ స్థలాలు ఉండగా, ఆలయాల వెలుపల 52,246.5 చదరపు గజాల ఖాళీస్థలాలు ఉన్నాయని, వీటికి వేలం పాటలు నిర్వహించి లీజుకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆలయాల భూములను ఆక్రమించిన వారికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధించేలా ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసిందన్నారు. సమావేశంలో ఈఓ మునిరాజ, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులంలో కనీస శుభ్రత పాటించండి

ఆర్డీఓ రంగస్వామి


విద్యార్థుల సమస్యలపై ఆరా తీస్తున్న ఆర్డీఓ రంగస్వామి

సంబేపల్లి : మండల పరిధిలోని దేవపట్ల మిట్ట వద్దగల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో మరుగుదొడ్ల పరిశుభ్రత, భోజనంపై జిల్లా ఆర్డీఓ రంగస్వామి తహసీల్దార్ మహేశ్వరి భాయ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గురుకులంలో మరుగుదొడ్లు అపరిశుభ్రతగా ఉండడం గమనించారు. పరిసర ప్రాంతాల్లో చెత్త కుప్పలుగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. గురుకులం పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీకళాదేవికి సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూశారు. పిల్లలకు నీటి వసతితో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. గురుకులం పాఠశాలకు సరఫరా చేసిన బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం గురుకులం డీసీఓ సుకన్యతో చర్చించారు. స్థానిక సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి సహకారంతో గురుకులానికి ప్రతి రోజు 5 ట్యాంకర్ల నీటిని అందిస్తున్నారని ప్రిన్సిపాల్ శ్రీ కళాదేవి ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నానో డీఏపీ పర్యావరణానికి శ్రేయస్కరం

ఇఫ్కో జీఎం జగన్‌మోహన్‌రెడ్డి


ఇఫ్కో నానో డీఏపీ ప్రయోజనాలపై వివరిస్తున్న జీఎం జగన్‌మోహన్‌రెడ్డి

మదనపల్లె : గుళికల రూపంలో ఉండే సంప్రదాయ ఎరువులకు ప్రత్యామ్నాయంగా ఇఫ్కో సంస్థ రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్‌తో కలిసి తీసుకువచ్చిన నానో డీఏపీ పర్యావరణానికి ఏ మాత్రం హాని కలిగించకుండా పంటలకు అవసరమైన పోషక అవసరాలను తీరుస్తుందని ఢిల్లీకి చెందిన ఇఫ్కో జీఎం డాక్టర్ ఎం.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో టమాటా పంటపై రైతులకు శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నానో యూరియా మాదిరిగానే.. నానో డీఏపీ 500 మిల్లీ లీటర్ల బాటిల్ 50 కిలోల డీఏపీ ఎరువుల బస్తాతో సమానమని స్పష్టం చేశారు. సంప్రదాయ డీఏపీ ఎరువుల బస్తాతో పోలిస్తే నానో డీఏపీ తక్కువ ధరకే రైతులకు అందుబాటులో ఉందన్నారు. శిక్షణా కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ బాలా హుస్సేనీ, డాక్టర్ శేషకిరణ్, డాక్టర్ పీరుసాహెబ్, డాక్టర్ శ్రీనివాసులు, ఏడీఏ శివకుమార్, ఏఓ నాగప్రసాద్, హార్టికల్చర్ ఆఫీసర్ ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, ఇఫ్కో జిల్లా అధికారి దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో వరుస చోరీలు


శంకర్‌రెడ్డి షాపు పైకప్పును పగులగొట్టిన దొంగలు

బి.కొత్తకోట : స్థానిక జ్యోతిచౌక్‌లోని మూడు దుకాణాల్లో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీలు జరిగాయి. నందిని పాలడిపో వెనుకవైపు నుంచి వచ్చిన దొంగలు పైకప్పు సిమెంటు రేకులను పగులగొట్టి పాలడిపోలోకి చొరబడ్డారు. టేబుల్ కింద పెట్టిన రూ.10వేలు నాణేలు, రూ.10వేలు చిల్లరనోట్లను ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న శంకర్‌రెడ్డి హార్డ్‌వేర్ పైకప్పు సిమెంటు రేకులను పగులగొట్టి షాపులోకి వచ్చారు. క్యాష్ టేబుల్ డ్రాను పగులగొట్టి అందులోని కొంత నగదును తీసుకెళ్లారు. తర్వాత బీరంగి రోడ్డులోని ఫాజిల్ మొబైల్‌షాపు పైకప్పు సిమెంటురేకులను పగులగొట్టి షాపులోకి వచ్చి టేబుల్ అరలో పెట్టిన రూ.12వేల నగదును దోచుకున్నారు. మొబైల్ ఫోన్లను మాత్రం ముట్టుకోకుండా వెళ్లిపోయారు. ఈ మూడు దుకాణాల్లో ఒకే తరహాలో చోరీలు జరిగాయి. సీసీ కెమెరాలో నమోదైన రికార్డులను ఎస్ఐ రామమోహన్ పరిశీలించారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

• వికసించిన బ్రహ్మకమలం



కలకడ పట్టణం తేరు వీధిలో నివాసం ఉంటున్న త్రికూటం విజయసారథిస్వామి ఇంటి ఆవరణలో బ్రహ్మ కమలం పువ్వు వికసించింది. దీంతో గ్రామంలోని మహిళలు మంగళహారతులు, పసుపు, కుంకుమతో పూజలు చేశారు. సంవత్సరానికి ఒకసారి మాత్రమే ఈ పువ్వు పూస్తుంది. గురువారం తెల్లవారుజామున 24 పుష్పాలు ఒకే మారు వికసించడంతో పెరటితోట మొత్తం కాంతిమయమైంది. – కలకడ

పోలీసు నిబంధనలకు లోబడే రాజారెడ్డి పోస్టుమార్టం

- పోస్టుమార్టం సమయంలో వీడియో చిత్రీకరణ
- రాజారెడ్డి హత్య కేసులో ఎలాంటి రాజకీయ కోణం లేదు
- తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం
- ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : పోలీసు నిబంధనలకు లోబడి, చట్టప్రకారమే డాడీ హోం రాజారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన డాడీహోం రాజారెడ్డి హత్యకేసుకు సంబంధించి ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పోలీసులపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఈ కేసు దర్యాప్తు సక్రమంగా జరగలేదని, పోస్టుమార్టం హడావుడిగా చేశారని, పోస్టుమార్టం సమయంలో వీడియో చిత్రీకరణ జరగలేదని.. ఇలా ఇతర ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఏఎస్పీ కేసు దర్యాప్తునకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాజారెడ్డి హత్య కేసుకు సంబంధించి నిరాధార ఆరోపణలను ప్రచారం చేయొద్దన్నారు. వీటిని ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో కూడా పొలిటికల్ హత్యలు జరుగుతాయని చెప్పిన వారిపై సంబంధిత పోలీస్‌స్టేషన్ నుంచి నోటీసులు జారీ చేశామన్నారు. ఆరోపణలకు సంబంధించి ఆధారాలుంటే సంబంధిత పోలీసు అధికారులకు ఇస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. రాజారెడ్డి హత్యలో రాజకీయ కోణం లేదన్నారు. కేవలం ఆస్తి గొడవల కారణంగానే ఈ హత్య జరిగిందని తెలిపారు. ఇది రాజకీయ హత్య అని ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. పోలీసుల విచారణ పక్కాగా, జాప్యం లేకుండా జరిగిందని తద్వారా వెంటనే నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారన్నారు.

పోలీసు నిబంధనలను పాటించాం

రాజారెడ్డి హత్య కేసులో ఐపీసీ, సీఆర్‌పీసీ నిబంధనలను పాటించామన్నారు. మొదటగా అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని రిక్విజేషన్‌లో కూడా స్పష్టంగా రాసి ఆస్పత్రి వైద్యాధికారులకు ఇచ్చామన్నారు. పోస్టుమార్టం సమయంలో ఫొటో, వీడియో చిత్రీకరణ కూడా చేశామని తెలిపారు. మొదటి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగించిన తర్వాత విచారణ చేస్తున్న పోలీసు అధికారులకు కొన్ని సందేహాలు వచ్చాయన్నారు. ఇదే విషయాన్ని కడప ఎస్పీ అన్బురాజన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య బృందంతో రీ పోస్టుమార్టం నిర్వహించామన్నారు. రీ పోస్టుమార్టం నిర్వహణలో ఇతరుల ప్రమేయం, ఒత్తిడి లేదని పేర్కొన్నారు. రెండోసారి నిర్వహించిన పోస్టుమార్టంలో రాజారెడ్డి హత్యకు గురైనట్లు తేలిందన్నారు. ఇందులో వైద్యుడి పాత్ర ఉందని తేలడంతో కేసులో ఏ–5 నిందితుడిగా చేర్చి అరెస్ట్ చేశామని ఏఎస్పీ తెలిపారు. శ్రీధర్‌రెడ్డి భార్య ప్రసన్న హత్య జరిగిన సమయంలో డాక్టర్‌కు రెండు సార్లు ఫోన్ చేసినట్లు చెప్పారు. ఈ కేసులో పూర్తి స్థాయి, లోతైన దర్యాప్తు చేస్తున్నామన్నారు. సీఐలు రాజారెడ్డి, నారాయణయాదవ్, ఎస్ఐలు అమర్‌నాథ్ రెడ్డి, రెడ్డిసురేష్, భాస్కర్ పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం


నిందితుడితో ఎస్ఈబీ సీఐ గురుప్రసాద్

కలకడ : పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పీలేరు ఎస్ఈబీ సీఐ గురుప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం మండలంలోని రాతిగుంటపల్లె సమీపంలోని కోన క్రాస్ వద్ద ఎర్రకోటపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన సయ్యద్ మునీర్‌బాషా సారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో ఎస్ఐ లక్ష్మినరసయ్య, సిబ్బంది యోదానంద, సుధాకర్, బాలకృష్ణ, గంగామహేశ్వరి పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆనందహేల

– సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

వాల్మీకిపురం : ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మాట తప్పకుండా తమను రెగ్యులర్ చేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, శేఖర్, రవి, ఇజాజ్, రమణ, సురేష్, ప్రేమలత, స్వప్న, నాగేంద్ర, కళావతి తదితరులు పాల్గొన్నారు.